## క్లుప్తంగా

### వినూత్నంగా అంబేడ్కర్ చిత్రం



విద్యార్థులు రూపొందించిన చిత్రం

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈదరాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆ మహనీయుడి చిత్రాన్ని వినూత్నంగా తీర్చిదిద్దారు. 8, 9 తరగతుల విద్యార్థులు ఇసుక, దారంతో ఈ చిత్రం రూపొందించారు. దీంతో పాటు అంబేడ్కర్ జీవితంలోని ప్రధాన ఘట్టాలను బొమ్మపై లిఖించి ఔరా అనిపించారు. హెచ్ఎం జి.నాగప్రసాద్ ఆధ్వర్యాన డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ చిత్రం వేశారు.

### పలివెల, గంటి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



గంటిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: పలివెల, గంటి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఎంపీపీ మార్గన గంగాధరరావు గురువారం శ్రీకారం చుట్టారు. పలివెల శివారు పూజారిపాలెంలో రూ.5.80 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గంటి గ్రామం చిన దళితపేటలో రూ.3.5 లక్షలతో సీసీ రోడ్డు, శెట్టిబలిజపాలెంలో రూ.1.5 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆ గ్రామంలో సర్పంచ్ సాగి బంగార్రాజు ఆధ్వర్యాన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు వివిధ ప్రభుత్వం పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రతి ఇంటా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు పలుకుతూ జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్లను స్వచ్ఛందంగా అతికించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గునిపే శ్యామల, ముళ్ల జనార్దన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు మట్టపర్తి వెంకట్రావు, పానుగుపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మజ్లిస్ ఆలపిస్తూ గుమ్మటం ఊరేగింపు

మామిడికుదురు: ఇమామ్ హజరత్ అలీ షహదత్‌లో భాగంగా ముస్లింలు గురువారం మామిడికుదురులో మజ్లిస్ ఆలపిస్తూ గుమ్మటం ఊరేగించారు. మొల్లా పంజా నుంచి తీసిన గుమ్మటాన్ని నగరం పెద పంజీషా వరకూ ఊరేగించారు. ఈ సందర్భంగా మర్షియా ఆలపించారు. సర్కిల్ పర్వత్ అలీబేగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద పంజీషాలో షహదత్ మజ్లిస్ నిర్వహించారు. మత ప్రబోధకులు కల్బే హుస్సేన్ జైదీ మజ్లిస్ ఆలపించారు.

### విద్యార్థులకు వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు

మామిడికుదురు: జగ్జీవన్‌రామ్, గాంధీ, పూలే, అంబేడ్కర్ జీవిత చరిత్రలపై పాశర్లపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అభ్యుదయ భీమ్ సాహితి (అభీసా) ఆధ్వర్యాన జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు ద్వారా బహుమతులు అందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం కేవీ లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేతలకు పెదమల్లు బాపిరాజు, నాగరత్నం పేరిట బహుమతులు అందజేశారు. అభీసా అధ్యక్షుడు డాక్టర్ పాలమూరి విక్రమ్, ఉపాధ్యక్షుడు నక్కా త్రిలోచనరావు, కార్యదర్శి కోటిపల్లి సంతోష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు ముత్యాల నరసింహారావు పాల్గొన్నారు.

### మంచినీటి చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

పి.గన్నవరం: నరేంద్రపురంలో రూ.26 లక్షలతో చేపట్టనున్న మంచినీటి చెరువు ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. సర్పంచ్‌లు బీర వెంకమాంబ, కొంబత్తుల ఏసుబాబు, వడలి కొండ, సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మీ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

### క్వాయర్ ఎగ్జిబిషన్‌కు కార్యాచరణ

మామిడికుదురు: కోనసీమలో క్వాయర్ ఎగ్జిబిషన్ కమ్ వర్క్‌షాప్ ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ తెలిపారు. పాశర్లపూడిలో గురువారం జరిగిన సమావేశానికి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు విళ్ల దొరబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ, పది పదిహేను రోజుల్లో ఈ ఎగ్జిబిషన్ కమ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణరాణే నుంచి లేఖ వచ్చిందని తెలిపారు. కోనసీమలో కొబ్బరి సాగు, ఇక్కడి రైతుల సమస్యలు, విజయవాడలోని కోకోనట్ బోర్డును కోనసీమకు తరలించడం తదితర అంశాలను ఎంపీ జీవీఎల్ నరసింహారావు ద్వారా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. వీటిపై కేంద్ర మంత్రి నుంచి సానుకూల స్పందన రావడం శుభ పరిణామమని పవన్‌కుమార్ తెలిపారు. సమావేశంలో కిసాన్ మోర్చా నేతలు పాల్గొన్నారు.

# ఆనందమానందమాయె..

- మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌జ
- కల నెరవేర్చారంటూ క్వాలిఫైడ్ అభ్యర్థుల కుటుంబాలు సంతోషం



ఈదరాడలో ఉపాధ్యాయుడిగా జాయినవుతున్న క్వాలిఫైడ్ అభ్యర్థి

మామిడికుదురు: రెండున్నర దశాబ్దాల నిరీక్షణకు తెర దించుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులను ఉపాధ్యాయులుగా నియమిస్తూ జారీ చేసిన ఆదేశాలు వారి కుటుంబాల్లో ఎనలేని ఆనందం నింపాయి. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు చూసి వారు భావోద్వేగానికి గురవుతున్నారు. తమ జీవితాలు మలిసంధ్యకు చేరుతున్నాయని, ప్రభుత్వ ఉద్యోగాలు దక్కే అవకాశమే లేదనే నిరాశా నిస్పృహల్లో ఉన్న వేళ నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అభయమిచ్చారు. హామీ ఇచ్చారు కానీ అది కార్యరూపం దాలుస్తుందా అనే సందేహంలో ఉన్న అభ్యర్థుల అనుమానాలను పటాపంచలు చేస్తూ ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వారు అవధులు లేని ఆనందంతో ఉప్పొంగుతున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు పొందిన వారి మనోగతం వారి మాటల్లోనే..

### పట్టరాని ఆనందంగా ఉంది



డీఎస్సీ–98లో క్వాలిఫై అయినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందాను. నాలుగు ప్రభుత్వాలు, ఐదుగురు సీఎంలు మా మొర ఆలకించలేదు. ఈ పరిస్థితుల్లో మాకు ఇచ్చిన హామీ మేరకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా అధిగమించి, సీఎం జగన్ మమ్మల్ని ఉపాధ్యాయులుగా నియమించడం గ్రేట్. ఆయన ఇచ్చిన మాట తప్పలేదు. ఆయనను మా పాలిట దేవుడిగా ఆరాధిస్తాం. ఇటువంటి నిర్ణయాలు తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలి. అది ఒక్క జగన్‌లో మాత్రమే ఉందని మేము విశ్వసిస్తున్నాం.

– యేడిద బాలగోపాలరావు, పెదపట్నం

### జగన్‌కు రుణపడి ఉంటాం



మా ఆశలు అడియాసలుగా మారిన వేళ సీఎం జగన్ మా పాలిట ఆపద్బాంధవుడిగా నిలిచారు. ఆయనకు మేం ఎంతో రుణపడి ఉంటాం. ఏ ఒక్కరి వల్లా సాధ్యం కానిది కేవలం జగన్ వల్ల మాత్రమే సాధ్యమైంది. ఏ ప్రభుత్వమూ మమ్మల్ని పట్టించుకోలేదు. చిన్నచూపు చూసింది. కానీ జగన్ సర్కార్ మాకు అండగా నిలిచింది. ఎక్కడ లేని ఆత్మస్థైర్యం నింపింది. డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు కొత్త జీవితాన్ని ప్రసాదించడం చాలా ఆనందంగా ఉంది.

– సర్కిల్ ఫఖర్ సాహెబ్, మామిడికుదురు

### తండ్రిని మించిన తనయుడు జగన్



పలు సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్నారు. అటు ప్రజలకు, ఇటు నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్నారు. ఇక మాకు ఉద్యోగాలు వచ్చే అవకాశమే లేదని మధనపడుతున్న సమయంలో ఆయన మా పాలిట ఆపద్బాంధవుడిగా మారారు. డీఎస్సీ–98 అభ్యర్థులను ఉపాధ్యాయులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మా అందరి జీవితాల్లో సంతోషం నింపాయి.

– పాటి ఎంవీఎస్ శ్రీనివాస్, మామిడికుదురు

# జగన్‌తోనే సంక్షేమ పథకాలు అమలు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మరింతగా అమలవుతాయని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, నేదునూరు గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నేదునూరు పెదపేటలో ఎమ్మెల్యే ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఆయన గ్రామంలో ఇంటింటికీ తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నుంచి సుమారు రూ.8 లక్షల వరకూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. సీఎం జగన్‌నే మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని చిట్టిబాబు కోరారు. గ్రామంలో రహదారులు, డ్రెయిన్ల ఏర్పాటుపై అధికారులతో చర్చించి, చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ**

అయినవిల్లిలో వినాయక సదన్‌కు వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఆలయ చైర్మన్ నంబూరి వెంకట రమణరాజు రూ.14.4 లక్షలు, టీవీఎస్ఎన్ రాజు రూ.7.5 లక్షలు సమకూర్చారు. ఈ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే చిట్టిబాబు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీను (బాబ్జీ) పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. నేదునూరు పీఏసీఎస్ చైర్మన్ చిలువూరి సాయిరాజు ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అంబాజీపేట: మాచవరం శివారు వెంకటేశ్వర కాలనీలో రూ.3 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రహదారులు నిర్మించామని తెలిపారు.

# నేను సంపాదించుకున్న ఆస్తి ప్రజలే

- ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- మెర్లపాలెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహణ



మెర్లపాలెంలో గడప గడపకూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: తన జీవితంలో సంపాదించుకున్న, తన తండ్రి తనకు ఇచ్చిన అత్యంత విలువైన ఆస్తి నియోజకవర్గ ప్రజలేనని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మెర్లపాలెంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.1.11 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఆరోగ్య కేంద్రం, రైతుభరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. రూ.1.40 కోట్లతో చేపట్టనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సభలో జగ్గిరెడ్డి ప్రసంగించారు. 'ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబడడం లేదా? అభివృద్ధి అంటే ఇది కాదా?' అని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా మెర్లపాలెంలో రూ.1.20 కోట్లతో నాడు – నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేశామని, పంచాయతీరాజ్ శాఖ, మండల పరిషత్ ద్వారా సుమారు రూ.68 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గ్రామంలో రూ.4.46 కోట్లతో చేస్తున్న, చేసిన అభివృద్ధి పనులే కాకుండా, వివిధ సంక్షేమ పథకాల ద్వారా 3,825 మంది లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం నేరుగా రూ.13.77 కోట్లు జమ చేసిందని, దీని గురించి ప్రతిపక్షాలు మాట్లాడకుండా ధరలు పెరిగిపోతున్నాయంటూ గగ్గోలు పెట్టడం వారి ఖర్మ అని దుయ్యబట్టారు. ప్రతిసారీ బటన్ నొక్కి ప్రజల ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్మును అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞులైన ప్రజలు సమయం వచ్చినప్పుడు బటన్ నొక్కి తమ ఓటుతో కృతజ్ఞతలు తెలుపుతారని చెప్పారు. దివ్యాంగులైనంత మాత్రాన చిన్నచూపు చూడకూడదని, వారు కూడా పట్టుదలతో పని చేస్తారనే విషయాన్ని నిరూపిస్తూ సచివాలయ భవన సముదాయాల నిర్మాణానికి కృషి చేసిన త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ జంపన సుబ్బరాజును, నానిని అభినందిస్తూ సత్కరించారు. కొత్త కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించి, ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల కోరిక మేరకు 6 విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, ఆత్రేయపురం, కొత్తపేట ఎంపీపీలు కుండ అన్నపూర్ణ, మార్గని గంగాధరం, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహం ఏర్పాటుపై వివాదం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం కొబ్బరితోట కాలువ గట్టు ప్రాంతం 5వ వార్డులోని ఆనందనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం బుధవారం అర్ధరాత్రి అదృశ్యం కావడం గురువారం వివాదానికి దారి తీసింది. గ్రామంలో రెండు రోజుల క్రితం జీవన్ యూత్ ఆధ్వర్యాన బాలం గ్రూపు ఏర్పాటు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై అదే ప్రాంతంలోని కట్టావారి గ్రూపు అభ్యంతరం తెలిపింది. దీనిపై ఇరు వర్గాల వారూ అధికారులను ఆశ్రయించారు. ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి అవమానించారంటూ దళిత సంఘాల నేతలు, అంబేడ్కర్ వాదులు ధర్నా చేశారు. ఆందోళనకారులతో సీఐ శేఖర్‌బాబు, తహసీల్దార్ రామకుమారి చర్చలు జరిపారు. అర్ధరాత్రి విగ్రహాన్ని ఎత్తుకు వెళ్లిపోయారంటూ సరెళ్ళ విజయ్‌ప్రసాద్, తోటి ప్రతాప్, నల్లి డేవిడ్, నేతల నాని ఆరోపించారు. శాంతిభద్రతల దృష్ట్యా విగ్రహాన్ని భద్రపరిచామని సీఐ బదులిచ్చారు. ఇక్కడ గతంలో చోటు చేసుకున్న సమస్యల రీత్యా 2020లో ఇరు సామాజిక వర్గాలు వారూ జెంటిల్‌మెన్ ఒప్పందం చేసుకున్నారని, నిబంధనలను అతిక్రమించబోమంటూ రాసుకున్నారని అన్నారు. ఆ ఒప్పందంలో సంతకాలు చేసిన వారే విగ్రహం పెట్టడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. దీనికితోడు పబ్లిక్ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం ఉండాలని స్పష్టం చేశారు. తమ విగ్రహాన్ని తమకు అప్పగించాలని ఆందోళనకారులు పట్టుబట్టారు. తదనంతరం పోలీసు స్టేషన్‌లో ఇరు సామాజికవర్గాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, మరి కొంత మందితో సీఐ చర్చలు జరిపారు. ఇరు వర్గాల వారికీ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సఖినేటిపల్లి, మలికిపురం ఎస్సైలు ఎస్.రాము, జి.సురేంద్ర, నాయకులు కొల్లాబత్తుల శుభాకర్, కె.చింటు, నల్లి సుధీర్, చొప్పల శశికుమార్, తాడి సహదేవ్, తాడి మోహన్ కుమార్, బి.రాంబాబు, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



### ఇద్దరు వైద్య సిబ్బందికి కరోనా

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్య సిబ్బందికి గురువారం కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆస్పత్రిలో పని చేస్తున్న సగం మందికి కరోనా పరీక్షలు చేయగా, వారికి నెగిటివ్ వచ్చింది. మిగిలిన సిబ్బందికి కూడా శుక్రవారం పరీక్షలు చేయనున్నారు. ఇద్దరు సిబ్బంది కరోనా బారిన పడటంతో ఆస్పత్రిలో శానిటేషన్ చేయించారు.

### వేట నిషేధం నిబంధనలు పాటించాలి

సఖినేటిపల్లి: ఈ నెల 14 నుంచి రెండు నెలల పాటు సముద్రంపై వేట నిషేధం అమలు కానున్నదని మత్స్యశాఖ సిబ్బంది తెలిపారు. దీనికి సంబంధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని మత్స్యకారులకు సూచించారు. పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ జేఎస్ రాజు, విలేజ్ అసిస్టెంట్ రాంబాబు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.



# సంక్షేమం, అభివృద్ధే సీఎం లక్ష్యం



గంగలకుర్రులో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి



అవిడిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి చంటి



రాజోలులో పాల్గొన్న నాయకులు



జొన్నాడ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అంబాజీపేట: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, ప్రజల ఆశీస్సులే ఆయనకు బలమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్ అన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన గంగలకుర్రులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారని అన్నారు. టీడీపీ కుట్ర, స్వార్థ రాజకీయాలను గమనించాలని, ఈ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా రావాలని, అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అంతకు ముందు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారి అనుమతితో స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి పండు తదితరులు పాల్గొన్నారు.

**పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు**

కొత్తపేట: సంక్షేమ పథకాల అమలుతో ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భవిష్యత్‌లో కూడా అందరం అండగా నిలవాలని అవిడి సర్పంచ్ రెడ్డి చంటి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వారికి ఇంటింటా మంచి ఆదరణ లభించింది. ప్రభుత్వ పథకాలు, జగన్ పాలనకు సంబంధించిన ఐదు ప్రశ్నలకూ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు, నేతల వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు, బి.సావరం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ రేవు జ్యోతి, మాజీ సర్పంచ్ మట్టా కృష్ణకుమారి, సచివాలయ కన్వీనర్ అడబాల జానకీరామ్ తదితరులు రాజోలు గాంధీనగర్, ఎండీ ఆస్పత్రి వీధి ప్రాంతాల్లో పర్యటించారు. బి.సావరంలో సొసైటీ అధ్యక్షుడు కంచి వెంకట రమణ, కుంపట్ల చిన్నారి, కాట్రేనిపాడులో పార్టీ నాయకుడు పైడిపర్తి రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి, సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు.

ఆలమూరు: జొన్నాడలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాంద్ర నాగ మోహన్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా సంక్షేమ పథకాలను వివరించి, 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు.

# బీసీలకు తగిన గుర్తింపు ఇస్తున్న సీఎం

మలికిపురం: బీసీ కులగణనకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడంపై రాజోలు నియోజకవర్గ బీసీ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పూలే, అంబేడ్కర్ భవనంలో గురువారం జరిగిన సమావేశంలో సీఎం జగన్ చిత్రపటం వద్ద వారు కృతజ్ఞతలు తెలిపారు. బిహార్, పంజాబ్, ఒడిశా మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా అధ్యయనానికి సీఎం జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం గొప్ప నిర్ణయమని అన్నారు. బీసీ సాధికార సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల బాబ్జీ, నాయకులు గుబ్బల మనోహరం, గుబ్బల రమేష్, చెల్లుబోయిన బుచ్చియ్య, గెడ్డం తులసీ భాస్కరరావు, దొమ్మేటి ఉమామహేశ్వరరావు, నల్లి శివకుమార్, దొంగ నాగ సత్యనారాయణ, కడలి బాబ్జీ, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

### భూసార పరీక్షలతో ఎంతో మేలు

రాజోలు: భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ రిసోర్స్ డిప్యూటీ డైరెక్టర్ వై.జ్యోతిర్మయి అన్నారు. 'మట్టి పరీక్ష – శిక్షణ వారం' కార్యక్రమాన్ని గురువారం రాజోలులో నిర్వహించారు. ఎంపిక చేసిన పొలాల్లో మట్టి సేకరించి, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో భూమి లోపల ఉండే పోషకాల గురించి తెలుసుకుని, ఆ మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చని జ్యోతిర్మయి తెలిపారు. ఏడీఏ రామ్మోహన్, మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ పాల్గొన్నారు.

అయినవిల్లి: మట్టి నమూనాలు సేకరించి, పరీక్షించడం ద్వారా ఏయే పంటలు సాగు చేస్తే రైతులకు ప్రయోజనం జరుగుతుందో తెలుస్తుందని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, అమలాపురం సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ తెలిపారు. మట్టి నమూనాల సేకరణపై నేదునూరులో రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి వై.శోభ పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆత్రేయపురం: రాజవరంలో బాబూ జగజ్జీవన్‌రామ్ యూత్ ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ, కొల్లి శ్యామ్ ఆధ్వర్యంలోని రాజవరం యూత్.. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఒకేచోట నెలకొల్పి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. వ్యక్తిగతంగా అంబేడ్కర్ అభిమాని అయినందువల్లనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్ని ఆటంకాలు వస్తున్నా లెక్క చేయకుండా రూ.5 కోట్లతో 40 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అంబేడ్కర్ అందరి వాడని, కొందరికే పరిమితం చేసేలా ఎవరూ ఉండకూడదని సూచించారు. రాజకీయ ఇబ్బందులు కూడా లెక్క చేయకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో సీఎం జగన్ కోనసీమ జిల్లా ఏర్పాటు చేశారని చెప్పారు. 75 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మాదిగలకు సముచిత స్థానం కల్పిస్తూ బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీని చేసిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ నేతలు గొల్లపల్లి డేవిడ్‌రాజు, సాకా ప్రసన్నకుమార్, కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, వైస్ ఎంపీపీ నిచ్చెనకోళ్ల రాణి తదితరులు పాల్గొన్నారు.